


11 మంది వాలంటీర్లు తొలగింపు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పాంచాలి పంచాయతీకి చెందిన 11 మంది వాలంటీర్లు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినందున వారిని గురువారం తొలగించినట్లు స్థానిక ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్ తెలిపారు. ఈ నెల 19న పాంచాలిలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి పార్టీ కార్యకలాపాల్లో పాల్గొన్న పాంచాలి సచివాలయం పరిధిలో పనిచేస్తున్న 11 మంది వాలంటీర్లను సాలూరు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఆదేశాలు మేరకు వారిని విధులు నుండి తొలగించినట్లు ఎంపిడిఒ తెలిపారు ప్రధానంగా పార్టీ కార్యకలాపాల్లో వాలంటీర్లు పాల్గొన్నారని ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన వాట్సాప్‌కు ఫోటోలను టిడిపి నాయకులు పంపించడంతో ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలు జారీ చేయడంతో వాలంటీర్లను తొలగించి వారి సంజాయిషీ కోరినట్లు ఎంపిడిఒ తెలిపారు.

అయోమయంలో వైసిపి కేడర్

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ముఖ్యంగా వైసిపి కేడర్ ఎన్నికల వేళ అయోమయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ముఖ్యంగా భవనాలు, రోడ్ల నిర్మాణ బిల్లులు చెల్లించకపోవడంతో ఆ పార్టీకి చెందిన సర్పంచులు, ఎంపిటిసి, ద్వితీయ శ్రేణి నాయకులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. మరోవైపు సచివాలయాల పవర్ అంతా కార్యదర్శుల చేతుల్లో పెట్టడం వల్ల స్థానిక సంస్థల ప్రతినిధుల పాత్ర నామమాత్రంగా మారింది. ఇంకోవైపు 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కపెట్టడం, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల గ్రామాల్లో పారిశుధ్యం, వీధిదీపాల నిర్వహణ, తాటినీటి సదుపాయం తదితరాలు కష్టతరంగా మారాయి. ఈనేపథ్యంలో నాయకుల్లో వైసిపి ప్రభుత్వంపై తీవ్ర అసహనం, అసంతృప్తి వ్యక్తమౌతోంది. ప్రస్తుత ఎన్నికల్లో ఈ ప్రభావం అధికార పార్టీపై తప్పక ఉంటుందని పలువురు విశ్లేషిస్తున్నారు.



- ఆర్థిక ఇబ్బందుల్లో సర్పంచులు, ద్వితీయ శ్రేణి నాయకులు
- వాలంటీర్ వ్యవస్థ వచ్చాక ప్రమేయం లేకుండానే సంక్షేమ పథకాలు
- ఆర్థిక సంఘం నిధులూ లేక పారిశుధ్యం, వీధిదీపాలు కల్పించలేని దుస్థితి
- ఎన్నికల్లో వీరిపాత్ర ఎలా ఉంటుందో?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వైసిపి అధికారంలోకి వచ్చాక రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, బల్క్‌మిల్క్ సెంటర్లు, వెల్‌నెస్ సెంటర్‌లో నిర్మాణాలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఇవన్నీ వైసిపికి చెందిన సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, లేదా ఆ పార్టీకి చెందిన నాయకులే కాంట్రాక్టు తీసుకుని నిర్మాణ పనులు చేపట్టారు. ఉపాధి హామీ ద్వారా వచ్చే మెటీరియల్ కాంపొనెంట్ నిధుల నుంచి వీటికి చెల్లింపులు చేయాల్సివుంది. కేంద్రం సక్రమంగా చెల్లించకపోయినా రాష్ట్ర ప్రభుత్వం నిలదీయలేదు. కొన్ని సందర్భాల్లో విడుదలైన నిధులను ఇతర అవసరాలకు దారి మళ్లించిందనే విమర్శలు ఉన్నాయి. ఈనేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఈ భవన నిర్మాణ పనులకు విజయనగరం జిల్లాలో రూ.28 కోట్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో రూ.10కోట్ల మేర బకాయి ఉంది. నాడు-నేడు పనుల బిల్లులు కూడా ఒక్క విజయనగరం జిల్లాలోనే రూ.7కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బిల్లుల కోసం వైసిపి గ్రామ స్థాయి నాయకులు, సర్పంచులు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. వడ్డీలు కూడా చెల్లించుకోలేక పోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కక్కలేక మింగలేక అన్నట్లు పార్టీని సమర్థించలేక, అలాగని వదులకోలేక సతమతమౌతున్నామని చెప్తున్నారు. వివిధ రూపాల్లో ప్రజల నుంచి పన్ను వసూలు చేస్తున్నందున రాజ్యాంగం ప్రకారం సగటు మనిషికి రూ.8చొప్పున పంచాయతీలకు, రూ.4 చొప్పున మండల, జిల్లా పరిషత్తులకు కేంద్ర ప్రభుత్వం కేటాయించాల్సివుంది. ఈలెక్కన ఉమ్మడి విజయనగరం జిల్లాకు రూ.కోట్ల ఆర్థిక సంఘం నిధులు విడుదల కావాల్సివున్నప్పటికీ సరిగా విడుదల కాలేదు. దీంతో, తాగునీటి మోటార్ల విద్యుత్ ఛార్జీల చెల్లింపునకు పంచాయతీలు కటకటలాడు తున్నాయి. వేసవిలో తాగునీటి పథకాల నిర్వహణ, నీటి సరఫరా భారంగా మారే ప్రమాదం కనిపిస్తోంది. పారిశుధ్య కార్మికులు (గ్రీన్ అంబాసడర్లు)కు వేతనాలు చెల్లించలేని దుస్థితి దాపురిస్తోంది. ఇలా ఒకటేమిటి కేంద్ర ప్రభుత్వ వైఖరితో స్థానిక సంస్థల మనుగడ దినదిన గండంగా మారింది. గ్రామ స్థాయిలో సర్పంచులు, నాయకులు నిలదీతలు, చీదరింపులకు గురి కావాల్సిన దుస్థితి ఏర్పడింది. సచివాలయాల నిర్వహణ, సంక్షేమ పథకాల మంజూరు కూడా తమకు సంబంధం లేకుండానే సాగిపోతోందంటూ సర్పంచులు, ఎంపిటీసి సభ్యులు వాపోతున్నారు. ఇలా వైసిపి సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, పట్టణాల్లో కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఓవైపు బిల్లులు అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో సదుపాయాలు కల్పించలేని పరిస్థితి, ఇంకోవైపు పథకాల మంజూరుకు పరపతి కూడా లేకుండా పోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈనేపథ్యంలో వీరు ఎన్నికల్లో వైసిపి విజయానికి ఏమేరకు తోడ్పాటునందిస్తారు? ఒకవేళ పార్టీ విజయానికి కృషి చేసినా ప్రజల మన్ననలు ఎంత వరకు పొందుతారు? అన్నదానిపై రాజకీయ నాయకులతోపాటు సాధారణ ప్రజల్లోనూ చర్చ జరుగుతోంది.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

సిఎఎ చట్టం అమలును అడ్డుకోవాలి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వ్యక్తలు డిమాండ్
- 26న కొవ్వొత్తులతో ర్యాలీ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

దేశ లౌకితత్వాన్ని బలహీనపర్చే సిఎఎ చట్టం అమలును అడ్డుకోవాలని వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అధ్యక్షతన వామపక్షాలు, లౌకిక, ప్రజాతంత్రశక్తులు సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్‌లతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాట్లాడిన సిపిఐ జిల్లా కార్యదర్శి కోరంగి మన్మధరావు, జిల్లా నాయకులు తోట జీవ, కాంగ్రెస్ జిల్లా నియోజకవర్గ నాయకులు మోహన్‌రావు, గోపాలం, సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లె వెంకటరమణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు కె.రామస్వామి తదితరులు మాట్లాడారు. పౌరసత్వ చట్టం సవరణ పూర్తికి విరుద్ధమైందని, ఈ చట్టం దేశంలోని ముస్లింల సమస్య కాదని, పౌరులందరి సమస్య, ఇది దేశ ఐక్యతకు లౌకిక, ప్రజాస్వామ్యానికి ముంచుకొస్తున్న ప్రమాదానికి సంబంధించిన సమస్య అని తెలిపారు. అన్ని మతాలు, జాతులు కలిసి పోరాడి స్వాతంత్రం సాధించుకున్నా యన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి దేశ లౌకిక స్వభావాన్ని నాశనం చేసి నిరంకుశ హిందూ మత రాజ్యాంగ మార్చడానికి చేస్తున్న ప్రయత్నంలో భాగమే ఎన్‌ఆర్‌సి, సిసిఎ అమలు చేస్తామన్నారు. ఇంత దుష్ట పన్నాగం పన్ని దేశాన్ని, రాజ్యాంగాన్ని బలహీనపరిచే సిఎఎ చట్టం అమలను అడ్డుకోవాల్సిన వైసిపి, టిఇపి, జనసేన పార్టీలు రాష్ట్రంలో బిజెపికి మోకరిల్లాయని విమర్శించారు. 2019లో పార్లమెంట్లో ఈ చట్టాన్ని ఈ పార్టీలు బలపర్చాయని, మత ప్రాతిపదికన పౌరసత్వం అంటే ప్రపంచ వ్యాప్తంగా, అమెరికాలో ఉన్న మన దేశ పౌరులకు ప్రమాదం వస్తుందని నాయకులు తెలిపారు అందుకు ఈ చట్టాన్ని అడ్డుకోవాలని సిపిఎం, సిపిఐ, సిపిఎంఎల్ న్యూ డెమొక్రసీ లిబరేషన్, కాంగ్రెస్, ప్రజాతంత్ర శక్తులు ఈనెల 26న పార్వతీపురంలో కొవ్వొత్తులు నిరసన కార్యాచరణ చేపడుతున్నాయని, ఆరోజు సాయంత్రం 6 గంటలకు పట్టణంలోని చర్చి సెంటర్ నుండి మెయిన్ రోడ్డు మీద నిరసన ర్యాలీ చేపట్టాలని రౌండ్ టేబుల్ నిర్ణయించింది. రౌండ్‌టేబుల్ సమావేశంలో పువ్వల ప్రసాదు, కె.గోపి (సిపిఐ), గోపాలం, మోహన్ (కాంగ్రెస్), బంకురు సూరిబాబు, సంచాన ఉమామహేశ్వరరావు, పి.రాజశేఖర్, అఖిల్, బలరాం (సిపిఎం) తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సమన్వయంతో వ్యవహరించాలి


ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పార్వతీపురం మన్యం, రాయగడ, కోరాపుట్ జిల్లాల్లో సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహణకు పరస్పరం సమన్వయంతో వ్యవహరించాలని నిర్ణయించారు. మూడు జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలతో గురువారం సమన్వయ సమావేశం వీడియో కాన్ఫరెన్స్ విధానంలో జరిగింది. మన్యం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ ఈ సమావేశాన్ని సమన్వయపరిచారు. సజావుగా, నిష్పాక్షికమైన ఎన్నికలే లక్ష్యంగా కృషి చేయాలని అన్నారు. ఈ జిల్లాల్లో ఒకే దశలో ఎన్నికలు జరుగుతున్నాయని, ప్రత్యేకించి ఐడి మద్యం, మాదకద్రవ్యాలను అరికట్టడం, ఉచితాల పంపిణీని నియంత్రించడం, పోలింగ్ సిబ్బందికి వాహనాలు సమకూర్చడం, జిల్లాల సరిహద్దుల్లో పోలింగ్ సిబ్బంది వెళ్లడం వంటి అంశాల్లో సమన్వయం ఉండాలన్నారు. కొటియా గ్రామాల్లో ఎన్నికల నిర్వహణ, సరిహద్దుల గుండా మద్యం రవాణా, రైల్వేలు - బస్సుల ద్వారా గంజాయిని తరలింపు నియంత్రణ, ఇరువైపుల సరిహద్దు చెక్‌పోస్టులపై నిఘా ఉంచాలని తెలిపారు. ఎన్నికలకు వాహనాలను సమకూర్చడంలో రెండు వైపులా సహకారం అవసరమనిఅన్నారు.

కొటియా ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

కొటియా ప్రాంత ఎన్నికలపై కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లు స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా ఓటు వేయడానికి అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు. ఓటు వేయకుండా అడ్డుకోకూడదు" అని ఆయన ఉద్బోధించారు. న్యాయపరమైన పరిధిలో ఉందని ఆయన పేర్కొంటూ జిల్లా యంత్రాంగాలు ఓటర్ల స్వేచ్ఛకు భంగం కలిగించ రాదని స్పష్టం చేశారు. ఓటర్లు తమ ఇచ్ఛానుసారం ఓటు వేస్తారు, ఇది చారిత్రాత్మకంగా కొనసాగుతోంద అని అన్నారు. మా జిల్లా యంత్రాంగం ఓటర్లను అడ్డుకోదని, మీ జిల్లా యంత్రాంగం ఓటర్లను అడ్డుకోవద్దని స్పష్టం చేయగా అందుకు కోరాపుట్ జిల్లా యంత్రాంగం సహకరించేందుకు అంగీకరించింది. 22 గ్రామాలకు 4 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఈ జాబితాను కోరాపుట్ జిల్లాకు పంపుతామని కలెక్టర్ తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా గుండా వెళ్లే పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఆటంకం కలగదని రాయగడ జిల్లా కలెక్టర్ అభ్యర్ధన మేరకు ఆయన తెలిపారు.

ఒడిశా కలెక్టర్ల తో సమన్వయ సమావేశం



ఒడిశా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ సరిహద్దు చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కోరాపుట్ జిల్లా కలెక్టర్ వి కీర్తి వాసన్ మాట్లాడుతూ ప్రశాంతంగా, సజావుగా ఎన్నికల నిర్వహణకు అన్ని అంశాల్లో సమన్వయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. కొటియా ప్రాంతంలో 8 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, అందులో 2 కేంద్రాలు సరిహద్దుకు సమీపంలో ఉన్నాయని చెప్పారు. కొటియా గ్రామాల్లో ఓటర్లకు తమ జిల్లా యంత్రాంగం ఎలాంటి ఆటంకాలు కలిగించవని తెలిపారు. రాయగడ కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ మాట్లాడుతూ కొంతమంది పోలింగ్ సిబ్బంది కొమరాడ మండలం మీదుగా పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉందని, ఈ తరుణంలో సహకరించాలని కోరారు. రాయగడ ఎస్‌పి హరీష్ బిసి, కోరాపుట్ పోలీసు అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌ఛార్జ్ డిఆర్‌ఒ జి.కేశవనాయుడు, ఎస్‌డిసి ఆర్‌వి సూర్యనారాయణ, జిల్లా రవాణా అధికారి సి.మల్లిఖార్జునరెడ్డి, ఎస్‌ఇబి ఎఇ ఎస్ జీవన్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా - ఒడిశా పోలీసుల సంయుక్త తనిఖీలు

ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రా ఒడిశా పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. కొమరాడ, పార్వతీపురం ఎస్‌ఐలు, కోరాపుట్ జిల్లా బందుగాం పోలీస్ స్టేషన్ సిబ్బంది గురువారం పార్వతీపురం మండలం, ఇతర ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో 14,500 లీటర్ల పులియబెట్టిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అలమండ వద్ద 32 డ్రమ్ముల్లో ఉన్న పది వేల లీటర్లను, కర్లి గ్రామం వద్ద 15 డ్రమ్ముల్లో ఉన్న 4,500 లీటర్ల పులియబెట్టిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు.



ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో పట్టుబడ్డ బెల్లం ఊటలు

వీడని ఉత్కంఠ

టికెట్‌పై టిడిపిలో అయోమయం

ప్రజాశక్తి - పాలకొండ



పాలకొండ (ఎస్టీ నియోజకవర్గం) తెలుగుదేశం టికెట్‌పై ఇప్పటికీ ఉత్కంఠం వీడలేదు. దాదాపు పార్వతీపురం మన్యం జిల్లాలో అన్ని నియోజకవర్గాలకు టికెట్లు ఖరారు చేసినప్పటికీ పాలకొండ టికెట్ విషయంలో మాత్రం పార్టీ అధినాయకత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ నిమ్మక జయకృష్ణ మొదటి నుండి టికెట్ ఆశిస్తున్నారు. అయితే పార్టీ కార్యక్రమాలు చేపట్టి నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి తానే అని చెప్పుకున్నారు. రెండుసార్లు ఓటమి పాలైన జయకృష్ణపై ఈసారి సానుభూతి కూడా కనిపించింది. అయితే నియోజకవర్గంలో బలమైన సామాజిక వర్గానికి చెందిన నేతలుగా గుర్తింపు పొందిన సామంతుల దామోదరరావు, కండాపు వెంకటరమణ, వారాడ సుమంత్ నాయుడు జయకృష్ణకు వ్యతిరేకంగా ఉన్నారు. నాలుగున్నరేళ్లలో ఆ నేతలను కలుపుకుని వెళ్లే ప్రయత్నం జయకృష్ణ చేయలేదని ఆ పార్టీలో కొంతమంది చెప్తున్నారు. టికెట్ రేసులో పడాల భూదేవి, గేదెల రవి, తేజోవతితో పాటు మరికొంతమంది ఉన్నారు. అయితే నియోజకవర్గంలో పార్టీలో గ్రూపుల పోరు ఉండడంతో ఈ సీటు జనసేనకి కేటాయిస్తారని కొద్ది రోజులుగా చర్చ జరుగుతుంది. సీట్లు కేటాయింపులు భాగంలో పాలకొండ జనసేనకే కేటాయిస్తారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మరో పక్క అరకు ఎంపీ అభ్యర్థిగా బిజెపి నుంచి కొత్తపల్లి గీతకు టికెట్ కేటాయించడంతో పాలకొండ సీటు కూడా బిజెపికి కేటాయించాలని ఆ పార్టీ నాయకులు పట్టుపడుతున్నట్టు తెలుస్తోంది. టిడిపికి ఇక్కడ టికెట్ ఇవ్వకపోతే సీటు గెలవడం కష్టమని నియోజకవర్గంలో సైకిల్‌కు పట్టుందని టిడిపి వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అయితే టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో సీటు ఎవరికి కేటాయిస్తారో, అభ్యర్థి ఎవరనేది వేచి చూడాల్సి ఉంది.

ఎసిబికి చిక్కిన డిప్యూటీ తహశీల్దార్

రూ.10వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

విజయనగరం మండల ఉప తహశీల్దార్ కొట్నాన శ్రీనివాసరావు గురువారం ఓ వ్యక్తి నుంచి రూ.10వేలు లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. నగరంలోని నోబుల్ నగర్‌కు చెందిన మురళీ అనే వ్యక్తి తన 150 గజాల ఇంటి స్థలానికి సంబంధించి సర్వే నెంరు అండార్సుమెంట్ కోసం రెవెన్యూ అధికారులను ఆశ్రయించాడు. అయితే ఈ పని చేసేందుకు డిటి.శ్రీనివాసరావు రూ.10వేలు డిమాండ్ చేయడంతో స్థల యజమాని మురళి ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలో దిగిన ఎసిబి అధికారులు మురళీ నుంచి శ్రీనివాసరావు రూ10.వేలు లంచం తీసుకుంటుండగా నేరుగా పట్టుకున్నారు. ఎసిబి డిఎస్‌పి వి.రామచంద్రరావు ఆధ్వర్యాన జరిగిన ఈ దాడిలో ఎసిబి అధికారులు పాల్గొన్నారు. డిటిపై కేసు నమోదు చేసి ఎసిబి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

సి-విజిల్ యాప్ ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సి.విజల్ యాప్ నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ రిటర్నింగు అధికారులను ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లపై రిటర్నింగు అధికారులతో కలెక్టరు గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ పౌరులు కోడ్ ఉల్లంఘనకు సంబంధించి చర్యలు గుర్తించినచో సి.విజల్ యాప్‌లో తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చని, నమోదు చేసిన 100 నిమిషాల్లో స్పందించి ఫిర్యాదుదారునికి తీసుకున్న చర్యలు గురించి తెలియ జేయాలని సూచించారు. సి-విజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులపై పర్యవేక్షణ ఉంటుందని, కావున వాటి పరిష్కారంలో నిబద్ధతతో పనిచేయాలని తెలిపారు. కంట్రోల్ కేంద్రాలు నిరంతరం పనిచేయాలని, రాత్రి సమయాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తనిఖీ బృందాల ఫిర్యాదు అందిన వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు.

పెండింగు ఫారాలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. షెడ్యూలు విడుదల చేసిన పది రోజుల తర్వాత ఫారాలపై చర్యలు తీసుకొనేందుకు అవకాశం ఉండదని, కావున ఎన్నికల నిబంధనలను అనుసరించి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి సిబ్బందికి శిక్షణ ఇప్పించేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎన్నికల సామగ్రి తరలింపు, స్ట్రాంగు రూం, రవాణా, భద్రత, పంపిణీ ఏర్పాట్లు పగడ్బందీగా చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాలకొండ, సాలూరు రిటర్నింగు, సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎ పిఒలు కల్పనాకుమారి, సి.విష్ణుచరణ్, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ జి.కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టర్ ఆర్‌వి సూర్యనారాయణ, పార్వతీపురం, పాలకొండ రిటర్నింగు అధికారులు, ఆర్‌డిఒలు కె.హేమలత, ఎ.వి.రమణ పాల్గొన్నారు.

కార్పొరేషన్ల రుణాలకు నోచని పేదలు

బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ కార్పొరేషన్లు నిర్వీర్యం
ఐదేళ్లలో ఉపాధి రుణాలకు పూర్తిగా తిలోదకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వెనుబడిన కులాలకు ఆర్థికంగా అండగా నిలవాల్సిన కార్పొరేషన్లు నిర్వీర్యమైపోయాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి పదవుల పంపకం చేపట్టినప్పటికీ ఆ కార్పొరేషన్ల ద్వారా ఆయా సామాజిక తరగతులకు ఎటువంటి రుణాలూ ఇవ్వలేదు. గత ఐదేళ్లలో కార్పొరేషన్ల ద్వారా ఇచ్చే ఉపాధి రుణాలు పూర్తిగా నిలిచి పోయాయి. దీంతో బిసి, ఎస్‌సి, ఎసిటి, మైనార్టీలకు తీరని నష్టం జరిగింది. సంక్షేమ పథకాల సొమ్మునే సామాజిక తరగతుల వారీగా ప్రభుత్వం లెక్కలు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తుంది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో దాదాపు 25 లక్షల జనాభా ఉన్నారు. వీరిలో బిసి జనాభా దాదాపు 50 శాతం వరకూ ఉండగా, ఎస్‌సి జనాభా 15 నుంచి 18 శాతం మధ్య, ఎస్‌టి జనాభా 2 శాతం, ముస్లిం 2 శాతం లోపు, క్రిస్టియన్ జనాభా 2 శాతం ఉన్నారు. గత ప్రభుత్వాల పాలనలో కార్పొరేషన్ల నుంచి ఆయా తరగతుల ప్రజలకు పెద్దఎత్తున ఉపాధి రుణాలు అందించేవారు. రూ.రెండు లక్షల రుణం అందిస్తే రూ. లక్ష సబ్సిడీని ప్రభుత్వం ఇచ్చేది. రూ. లక్ష రుణం ఇస్తే రూ.50 వేలు సబ్సిడీ వర్తించేది. రుణం తీసుకున్న లబ్దిదారులు కచ్చితంగా ఏదోక ఉపాధి పొందుతున్నట్లు చూపించాల్సి ఉండేది. కిరాణా దుకాణాలు, పాడి పరిశ్రమ, వివిధ రకాల దుకాణాలు ఏర్పాటు చేసుకుని కార్పొరేషన్ల రుణాలతో ఎన్నో కుటుంబాలు ఉపాధి పొందేవి. ఇవికాకుండా రూ.20 లక్షల ఖరీదు చేసే కార్లను సైతం కార్పొరేషన్ల ద్వారా అందించేవారు. బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చేవారు. కారు నడుపుకుంటూ ప్రతినెలా బ్యాంకులకు వాయిదాలు చెల్లిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. కార్పొరేషన్ల రుణ వితరణలో ప్రత్యేక విభాగం నిరంతరం పనిచేసేది. అంతకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ ఇదే ఒరవడి ఉండేది. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్పొరేషన్ల పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 50 కార్పొరేషన్లుగా విస్తరించి చైర్మన్లను నియమించినప్పటికీ జనానికి ఉపయోగపడని పరిస్థితి ఉంది. గత ఐదేళ్లలో కార్పొరేషన్ల ద్వారా ఏఒక్క కుటుంబానికి ఉపాధి లభించని పరిస్థితి నెలకొంది. దీంతో జిల్లాలో 70 శాతానికిపైగా ఉన్న వెనుకబడిన సామాజిక తరగతుల ప్రజానీకానికి స్వయం ఉపాధి అవకాశాలు పూర్తిగా కనుమరుగ య్యాయి. అందరికీ అందించే అమ్మఒడి, చేయూత, పెన్షన్లు వంటి పథకాల సొమ్మును ఆయా సామాజిక తరగతులకు ఖర్చు చేసినట్లు ప్రభుత్వం లెక్కలు చూపించడంపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమ పథకాలకు ఇచ్చిన సొమ్ముకు, కార్పొరేషన్ల రుణాలకు ఏవిధంగా పోలికపెడతారని ఆయా సామాజిక తరగతుల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కార్పొరేషన్ల ద్వారా రుణాలందిస్తే చదువుకున్న ఎంతోమందికి ఉపాధి లభించి జీవితంలో నిలదొక్కుకునే వారమని, అటువంటి పరిస్థితి లేకుండాపోయిందని నిరుద్యోగ యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వాలేవీ ఈ విధంగా చేయలేదనే చర్చ నడుస్తోంది. ఎన్నికల తరుణంలో బిసి కార్పొరేషన్ల అంశం చర్చ నీయాంశంగా మారింది.

వాలంటీర్లతో ఎమ్మెల్యే సమావేశం విఫలం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్



టిడిపి కార్యకర్తలు సమావేశాన్ని అడ్డుకోవడంతో వెనుతిరిగి వస్తున్న ఎమ్మెల్యే జోగారావు

మున్సిపాలిటీలోని 8వ వార్డుకు చెందిన వాలంటీర్లు, గృహసారధులతో గురువారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు సమావేశం నిర్వహించడానికి చేసిన ప్రయత్నాలు స్థానిక టిడిపి కార్యకర్తల చొరవతో విఫలమయ్యాయి. 7వవార్డు టిడిపి కౌన్సిలర్ కోరాడ నారాయణరావు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో స్థానిక ఎమ్మెల్యే భారీగా వైసిపి కార్యకర్తలతో తరలివచ్చి వాలంటీర్లతో సమావేశం నిర్వహణకు పూనుకున్నారని తెలిపారు. వెంటనే ఎన్నికల మానిటరింగ్ సెల్‌కు ఫోన్ చేసినప్పటికీ వారి నుంచి స్పందన లేదన్నారు. వెంటనే స్థానిక టిడిపి కార్యకర్తలు అప్రమత్తమవ్వడంతో ఎమ్మెల్యే తన అనుచరులతో సమావేశం నిర్వహించకుండా వెనుదిరిగారని, ఇలాంటి సంఘటనలపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి తక్షణమే స్పందించాలని, అధికారపక్ష నాయకుల ఆగడాలను అడ్డుకోవాలని నారాయణరావు కోరారు.

ఎంఎన్‌ఒ సస్పెన్షన్

ప్రజాశక్తి-కురుపాం

స్థానిక సిహెచ్‌సిలో ఎంఎన్‌ఒగా విధులు నిర్వహిస్తున్న సిహెచ్ కిరణ్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్టు ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ జి.కేశవ నాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన పోస్టులను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసినందుకు గాను కిరణ్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. ఈనెల 27న ఇడుపులపాయలో వైసిపి బస్సు యాత్ర ప్రారంభమవుతుందని అతని పేరుతో సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసినందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన, ఉద్యోగి ప్రవర్తనా నిబంధనల మేరకు సస్పెన్షన్ చేయడం జరిగిందని తెలిపారు.

ధాన్యం డబ్బులు చెల్లించకపోతే ఆందోళన


ప్రజాశక్తి - కొమరాడ

ఈ నెల 26వ తేదీ లోపు రైతులు ఖాతాలో ధాన్యం డబ్బులు జమ చేయకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి అన్నారు. ప్రభుత్వానికి ధాన్యం అమ్మిన రైతుల ఖాతాల్లో వెంటనే డబ్బులు జమచేయాలని కోరుతూ మండల కేంద్రంలోని జూనియర్ కాలేజ్ సెంటర్ వద్ద గురువారం రైతులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎంతో శ్రమించి కష్టపడి అప్పులు చేసి ధాన్యాన్ని పండించి ప్రభుత్వానికి అమ్మితే ఇప్పటికి 56 రోజులు కావస్తున్నా ఇంత వరకూ రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు వేయలేదన్నారు. దీంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహించారు. ధాన్యం కొనుగోలు చేసిన మూడు వారాల్లోనే డబ్బులు వేయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు వేయకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున రైతులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.


కొమరాడ: నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, ధాన్యం రైతులు

ధాన్యం డబ్బులు చెల్లించకుంటే నిరసన

జియ్యమ్మవలస: రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసిన ప్రభుత్వం 21 రోజుల్లో రైతు ఖాతాలకు డబ్బులు వేస్తామని హామీ ఇచ్చి నేటికి రెండు నెలలు కావస్తున్నా ఒక్క రూపాయి కూడా చెల్లించడం లేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మన్యం జిల్లాలో 4వేల మంది రైతులకు చెందిన రూ.48.25 కోట్లు ధాన్యం బకాయిలు ఉన్నాయని వీటిని సోమవారంలోగా చెల్లించకుంటే రైతులతో కలిసి ఎన్నికల నిబంధనలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారుల సహకారం తీసుకుని నిరవధిక నిరసన కార్యక్రమాన్ని చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు బడే స్వామి నాయుడు, లచ్చిరెడ్డి సత్యనారాయణ, దత్తి చంద్రమౌళి, పల్ల వెంకట నాయుడు, రంభ కృష్ణమూర్తి నాయుడు, గుణుపూరు వెంకట నాయుడు తదితరు రైతులు పాల్గొన్నారు.


డిప్యూటీ సిఎంను కలిసిన ఎమ్‌పి అభ్యర్థి తనూజ

డిప్యూటీ సిఎంను కలిసిన ఎమ్‌పి అభ్యర్థి తనూజ

ప్రజాశక్తి - సాలూరు

డిప్యూటీ సిఎం పి.రాజన్నదొరను గురువారం అరుకు ఎంపి అభ్యర్థి డాక్టర్ గుమ్మ తనూజ రాణి కలిశారు. ఆమె భర్త, వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి శెట్టి వినయ్‌తో కలిసి రాజన్నదొరను ఆయన నివాసంలో కలిశారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ఎంపిఅభ్యర్థిగా పోటీ చేస్తున్న నేపథ్యంలో తన గెలుపు కోసం కృషి చేయాలని వారు కోరారు. ఆమె రాజన్నదొరకు పుష్పగుచ్ఛం అందజేసి ఆశీస్సులు అందుకున్నారు. రాజన్నదొర తనూజా రాణికి దుశ్శాలువాతో సన్మానించారు. అక్కడే ఉన్న వైసిపి నాయకులు దండి శ్రీనివాసరావు, గొర్లి జగన్మోహన్ రావు, జర్జాపు సూరిబాబు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావును ఆమె కు పరిచయం చేశారు.

మరో విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్


మృతి చెందిన తారకేశ్వరరావు

చదువులో వెనుకబడి పోయానన్న మనస్థాపంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న బిటెక్ విద్యార్థి కొల్లూరు తారకేశ్వరరావు (16) సంఘటన మరువక ముందే పార్వతీపురంలో మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పట్టణంలోని 24వ వార్డు కోడిగుడ్ల వీధికి చెందిన నాడెం ఈశ్వరరావు, జగదీశ్వరి కుమారుడు నాడెం సురేష్ పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల జరిగిన పరీక్షలను బాగా రాయలేదనే మనస్తాపంతో తరచూ తల్లితండ్రుల దగ్గర బాధపడుతూ ఉండేవాడు. గురువారం మధ్యాహ్నం పాల వ్యాపారం చేస్తున్న తన తల్లిదండ్రులు బయటకు వెళ్లగానే తన ఇంట్లోనే ఫ్యాన్ రాడ్డుకు చున్నీ బిగించుకుని ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటికి తిరిగి వచ్చిన తల్లిదండ్రులు తలుపులు తీసేసరికి విగతజీవిలా ఉన్న కుమారుడ్ని చూసి హతాసులయ్యారు. పోలీసుల ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ సంతోషి కుమారి ఘటనపై వివరాలు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టంకు తరలించారు. తండ్రి పాల వ్యాపారం చేస్తుండగా, తల్లి ప్రయివేట్ పాఠశాలల్లో హిందీ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఒక్కగానొక్క కుమారుడు ఇలా ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరై రోధిస్తున్నారు.


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ ఈశ్వరరావు

శిశు మరణాలు తగ్గించేందుకు ప్రణాళికలు

ప్రజాశక్తి - సీతానగరం

శిశుమరణాల రేటు తగ్గించేందుకు అన్ని శాఖల సమన్వయంతో పని చేయాలని ఎంపిడిఒ ఎం. ఈశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వైద్య సిబ్బంది, అంగన్వాడి, వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశు మరణాలు, శిశు మరణాలు రేటు తగ్గించేందుకు ముందస్తు చర్యలో భాగంగా అన్ని శాఖలు ముందుగా గుర్తించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, రక్తహీనత లోపించకుండా చూసేందుకు ఆ సమయాలలో వారికి సూచనలు సలహాలు అందించాలన్నారు. దీంతోనే శిశుమరణాల రేటు తగ్గుతుందని అన్నారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు ఎం. రాధాకాంత్, టి. పావని, ఎపిఎం ఆర్ శ్రీరాముల నాయుడు, అంగన్వాడి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి గీతారాణి

ప్రతి గడపనూ తట్టి ఓటు అడుగుదాం

ప్రజాశక్తి - కురుపాం

ప్రతి గడప తట్టి ఓటు అడుగుదామని హిజ్రాల నాయకులు, కురుపాం స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి అడ్డాకుల గీతారాణి అన్నారు. గురువారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద నియోజకవర్గంలో గల హిజ్రాలతో ప్రత్యేక సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను పోటీ చేయనున్న నేపథ్యంలో మేనిఫెస్టో తయారు చేస్తున్నామని, దీనికి పట్టుకొని ప్రతి గడపను తట్టి ఓటు అడిగి మనలను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను కోరుదామని అన్నారు. ఇందుకు అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఆరిక చంద్రశేఖర్, పల్లా సురేష్, రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


డిప్యూటీ తహశీల్దార్‌కు వినతినిస్తున్న బాధితులు

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి - వీరఘట్టం

తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ గురువారం సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కనీసం నీడ లేక అద్దె ఇంట్లో ఉండి కాలం గడుపుతున్నారని, అర్హులైనప్పటికీ ఇళ్ల స్థలాల మంజూరులో నాయకులు చెప్పిన వారికే చేతివాటం చూపించి అర్హత లేని వారికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారని తెలిపారు. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా కనీసం అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న వారికి గృహాలు ఉన్నదీ, లేనిది పరిశీలించి న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. దరఖాస్తు ఇచ్చిన వారిలో సిపిఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి పి.భాస్కరరావు, అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు నర్సిపురం దుర్గాచంద్ర చూడామణి, డి.సూర్యకళ, తదితర మహిళలు పాల్గొన్నారు.

శాటిలైట్ తయారీకి సాంకేతిక సహకారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

శాటిలైట్ తయారీకి విద్యార్థులు ముందుకు వస్తే తన వంతు సాంకేతిక సహకారం అందిస్తానని అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రీసెర్చ్ లేబొరేటరీకి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ కరణం దుర్గాప్రసాద్ భరోసా ఇచ్చారు. గురువారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన మిషన్ టు దిమూన్ - సాంకేతికత, అవకాశాలు, సవాళ్లుఅనే అంశంపై ఆయన అతిథి ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిజికల్ రీసెర్చ్ లేబొరేటరీలో ఇంటర్న్ షిప్, ప్రాజెక్టులు, ఉద్యోగ అవకాశాలు గురించి వివరించారు. చంద్రుని ఉపరితల వాతావరణంలో వివిధ ఉష్ణోగ్రతల మార్పులు కనగొనేందుకు ఉపకరించే పరికరాన్ని కనుగొనడంలో ఆయన కీలక పాత్ర పోషించిన విషయం గురించి వివరించారు. డాక్టర్ దుర్గాప్రసాద్‌ను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఎసి డీన్ డాక్టర్ పిఎస్‌వి రమణారావు, డీన్ డాక్టర్ సన్నీ డయాల్, ఎఫ్‌సిఇ. విభాగాధిపతి జోగినాయుడు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

తూనిక యంత్రాలకు సీల్ లేకపోతే చర్యలు

ప్రజాశక్తి - పాలకొండ

తూనిక యంత్రాలకు సీల్ లేకపోతే చర్యలు తీసుకుంటామని శ్రీకాకుళం జిల్లా తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ విశ్వేశ్వరరావు హెచ్చరించారు. పాలకొండ పట్టణంలో పలు దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీల్ లేని 10 తూనిక యంత్రాలను గుర్తించి వాటిపై కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో శ్రీకాకుళం ఇన్‌స్పెక్టర్ రాజారమేష్, పార్వతీపురం ఇన్స్పెక్టర్ రత్న రాజు, టెక్నికల్ అసిస్టెంట్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

బిజెపి, టిడిపి, వైసిపి అభ్యర్థులను ఓడించి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. గురువారం గరుగుబిల్లి మండల కేంద్రంలో సిపిఎం కార్యకర్తల సమావేశం బివి రమణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అవలంభిస్తున్న విధానాలు దేశ ప్రజల ఆర్థిక, సామాజిక భద్రతకు తీవ్ర నష్టం చేకూర్చుతున్నప్పటికీ రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి బిజెపిని వ్యతిరేకించకపోగా, బలపరచడం, జట్టు కట్టడం సిగ్గుచేటని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే మూడు వ్యవసాయ చట్టాలను, కార్మికులకు నష్టం చేకూర్చే లేబర్ కోడ్లను బిజెపి తీసుకొస్తే టిడిపి, వైసీపీలు బలపర్చాయన్నారు. అందువల్ల బిజెపికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతుగా ఉన్న టిడిపి, వైసిపిలను ఓడించి ప్రజల తరపున నికరంగా పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులను రాబోయే పార్లమెంటు అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మండంగి రమణ, వై.మన్మధరావు, సుంకి గ్రామపంచాయతీ సర్పంచ్ కరణం రవీంద్ర, కలిశెట్టి జగ్గారావు, గిరిజన సంఘం నాయకులు బిడ్డిక అడిత్తు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు కృష్ణమూర్తి

మూగబోయిన బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్లు

ప్రజాశక్తి - కురుపాం

మన్యంలో గిరిజన ప్రజలకు సమాచార సేవలు అందించాలని అప్పటి ప్రభుత్వం సుమారు 80 గిరిజన గ్రామాలకు సిగ్నల్ అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా మండలంలో పంచాయతీ కేంద్రాలైన జి.శివడ, వలసబల్లేరు గిరిజన గ్రామాల్లో బిఎస్ఎన్ఎల్ టవర్లు నిర్మించారు. అంతవరకు బాగానే ఉన్నప్పటికీ కేవలం అవి దిష్టిబొమ్మల్లా ఉండడం తప్ప, వాటివల్ల ఎటువంటి ప్రయోజనం చేకూరడంలేదని ఆ గ్రామాల వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎప్పుడు సిగ్నల్ వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియదని, కొన్ని సందర్భాల్లో నెలల గడుస్తున్నా సిగ్నల్ ఉండని పరిస్థితి ఉందని అన్నారు. అటువంటి టవర్లు ఎందుకు మా గ్రామాల్లో నిర్మించారో అర్థం కావడంలేదని, అత్యవసర సమయంలో కనీసం 108కి ఫోన్ చేద్దామనే సిగ్నల్ పనిచేయక ఆటోలతో ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు. అటువంటి టవర్లు తమకు ఎందుకని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి టవర్ మరమ్మతులు వెంటనే చేపట్టాలని, లేకుంటే పూర్తిగా తొలగించి వేరే టవర్లు నిర్మించి తమకు సమాచార సౌకర్యాలు కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.


మూగబోయిన సెల్ టవర్ ఇదే..

ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఒడిశాతో పాటుగా ఇతర ప్రాంతాల నుంచి ఆంధ్రా సరిహద్దులలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని కచ్చితంగా వివరాలను నమోదు చేసి తనిఖీ చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పార్వతీపురం ఆర్‌డిఒ కె.హేమలత పోలీసులకు సూచించారు. గురువారం మండలంలోని రావికోన పంచాయతీ, బట్టి వలస, ఆడారు గ్రామాల దగ్గర ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని అనుసరించి వాహన రవాణాపై నిఘా ఉంచాలని అధిక నగదు మాదకద్రవ్యాలతో పాటు ఇతర నిషేధిత వస్తువులు వాహనాలలో ఉంటే వెంటనే అదుపులోకి తీసుకొని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమాచారం అందించాలని, పోలీసు కేసులు నమోదు చేయాలని కోరారు.


పార్వతీపురం రూరల్: పోలీసులకు సూచనలు చేస్తున్న ఆర్‌డిఒ హేమలత

ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ

ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆర్‌డిఒ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.హేమలత అధికారులను ఆదేశించారు. రానున్న ఎన్నికల విధులు భాగంగా ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు గురువారం తన కార్యాలయంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు సెక్టార్ ఆఫీసర్లకు కూడా ఎన్నికల విధులపై తగు సూచనలు ఇచ్చారు. ఈ అవగాహన సదస్సులో పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట, తహసీల్దార్లు, ఎ.ఆనందరావు, ఎ.శ్రీనివాసరావు, జివి జనార్ధనరావు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మర వాహన తనిఖీలు


పాచిపెంట: ఎఎస్‌పి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

భామిని: మండలంలోని బత్తిలి చెక్ పోస్ట్ వద్ద బత్తిలి ఎస్ఐ సిహెచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది గురువారం ముమ్మరంగ వాహన తనిఖీలు నిర్వహించారు. బత్తిలి చెక్ పోస్ట్ ఆంధ్ర -ఒరిస్సా సరిహద్దు చెక్ పోస్ట్ అని, ఒరిస్సా నుండి ప్రతీ వాహనాన్ని పూర్తి స్థాయిలో తనిఖీలు చేపట్టాలని చెక్ పోస్టు సిబ్బందికి సూచించారు. ఎన్నికల నేపథ్యంలో భద్రతా చర్యలలో భాగంగా ముమ్మరంగ తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సీతానగరం: మండలంలోని బూర్జ కృష్ణరాయపురం, వెంకటాపురం గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను గురువారం సెక్టోరియల్ ఆఫీసర్, ఇఒపిఆర్‌డి కేకే వర్మ, ఏఎస్ఐ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, మౌలిక వసతులపైన అన్ని కేంద్రాల బిఎల్‌ఒలను అడిగి తెలుసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, బిఎల్‌ఒలు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టంలో పోలీస్ కవాతు

వీరఘట్టం: మండల కేంద్రంలోని గురువారం పోలీస్ కవాతు నిర్వహించారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో భాగంగా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా ఉండేందుకు తామున్నామంటూ పోలీసులు ప్రజలకు ఈ కవాతు ద్వారా ధైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా పట్నంలోనే అన్ని వీధులలో పార మిలటరీ ద్వారా కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ ఎస్.కె ఫక్రుద్దీన్, పోలీస్ బలగాలు పాల్గొన్నాయి.

జియ్యమ్మవలస: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆయా పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్తు, ఫర్నీచర్, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపు తదితర మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని స్థానిక తహశీల్దార్ సీతారామయ్య బిఎల్‌ఒలను ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో మండల పరిధిలో గల 59 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బిఎల్‌ఒలతో సమావేశం ఏర్పాటు చేశారు. అలాగే ఎన్నికల కోడ్ నిబంధనను కచ్చితంగా పాటించాలని ఉద్యోగులు, రాజకీయ నాయకులతో వెళ్లడం, ఎన్నికల సమయంలో అందుబాటులో లేకపోవడం జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నిర్వహణకు వచ్చిన సిబ్బందికి అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయడం వంటి అంశాలలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎం.శ్రీనివాసరావు, ఉప తహశీల్దార్ ఆర్.పకీరు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌పోస్టును తనిఖీ చేసిన ఎఎస్‌పి

పాచిపెంట: ఎన్నికల కోడ్ సందర్భంగా గురువారం మండలంలోని పి.కోనవలస, పద్మాపురం చెక్ పోస్టులను పార్వతిపురం ఎఎస్‌పి శ్రావణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. ఎన్నికల నేపథ్యంలో మారుమూల గ్రామాలైన పద్మాపురం, పెద్దవలస, ఈతమానువలస పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట స్థానిక ఎస్ఐ పి. నారాయణ రావు, సిబ్బంది పాల్గొన్నారు.


జియ్యమ్మవలస: సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ సీతారామయ్య

గిరిజన గ్రామాల్లో 'బాబు షూరిటీ'

ప్రజాశక్తి- పాచిపెంట

మండలంలోని మూటకూడు, శతాభి, గరిసిగుడ్డి పంచాయతీల్లో గల పలు గ్రామాల్లో టిడిపి మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ టిడిపిని గెలిపిస్తే అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం కొంతమంది గిరిజనులు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారు రోడ్లు, తాగునీరు, మౌలిక సదుపాయాలు, నిత్యవసర ధరలు, పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. టిడిపి అధికారంలోకి రాగానే నిత్యవసర ధరలను తగ్గిస్తామని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ముఖి సూర్యనారాయణ, గూడెపు యుగంధర్, కొత్తల పోలినాయుడు, పి.ఉమామహేశ్వరరావు, గొర్లె జగదీష్, గొర్ల సత్యం, దండి మోహన్ రావు, బలరాం, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


పాచిపెంట: మాట్లాడుతున్న సంధ్యారాణి

కురుపాం : మండలంలోని గుమ్మిడిగూడ పంచాయతీ గుజ్జిపాడు, సింగుపురం, సంగెడ్డా గిరిజన గ్రామాల్లో గురువారం సాయంత్రం టిడిపి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల పై టిడిపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఇంటికీ కుళాయి, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తామని రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య, నాయకులు కె.రంజిత్ కుమార్, సుకేష్ పండా తదితరులు పాల్గొన్నారు.


కురుపాం: సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలతో టిడిపి నాయకులు

కార్యదర్శులతో ఎంపిడిఒ సమావేశం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ సూర్యనారాయణ, ఇఒపిఆర్‌డి గోపాల్‌రావు మండలంలోని అందరు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడు తూ 8శాతం గ్రంథాలయ పన్ను అందరూ గ్రంథాలయ నిధులకు జమ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, గరుగుబిల్లి శాఖ గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదనరావు పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - భామిని

మండలంలోని బత్తిలి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కె.దామోదరరావు ఆధ్వర్యంలో సికిల్ సెల్ ఎనీమియా నివారణకుపై మనుమ కొండలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సికిల్‌సెల్ ఎనీమియా జన్యు సంబంధ వ్యాధి అని, రాబోయే తరాలకు ఈ వ్యాధి సోకకుండా ఏ అంశాలు పాటించాలి, వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. దేశం మొత్తం 2047కి పూర్తి స్థాయిలో ఈ వ్యాధి నిర్మూలించాలని ఈ అవగాహన కార్యక్రమాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కేశవ, సంక్షేమ సహాయకులు గంగాధర్, వైద్య సిబ్బంది ఉన్నారు.


మాట్లాడుతున్న సర్పంచ్ కేశవ

కెజిబివి పాఠశాల సందర్శన

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలోని జోగింపేట కెజిబివి పాఠశాలను కెజిబివి, సమగ్ర శిక్ష డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌డివి రమణ గురువారం సందర్శించారు. పాఠశాలలో మెనూ ప్రకారంగా భోజనాలు తనిఖీ చేశారు. స్వయంగా భోజనాలను పిల్లలకు వడ్డించారు. పదోతరగతి విద్యార్థినిల విద్యా, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. వారికి అధ్యధిక మార్కులు రావాలని, భవిష్యత్‌లో మంచి స్థాయిలలో స్థిరపడాలని సూచించారు. జిల్లాలో రెండవ విడతలో కెజిబివికి విడుదలైన అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలించారు. భవిష్యత్‌లో అన్ని కెజిబివిల్లో సైన్స్ ఉపాధ్యాయినిలందరికి ట్రైనింగ్ ఇప్పించాలని చెప్పారు. పంచ తంత్ర వంద రోజుల పరీక్ష ప్రణాళికా బద్ధంగా జరగడం వల్ల మంచి ఫలితాలు సాధించే అవకాశం ఎక్కువ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిసిడిఒ కె.రోజారమణి, సమగ్ర శిక్ష వైకెబి హరిప్రసాద్, ఎపిఒ చొక్కాపు శ్రీనివాసరావు, స్థానిక ప్రిన్సిపాల్ జొన్నాడ సంధ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బందికి సూచనలు చేస్తున్న డైరెక్టర్ రమణ



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

నోటి శుభ్రతే ఆరోగ్యానికి భద్రత

ప్రజాశక్తి - కురుపాం

నోటి శుభ్రతతోనే మనిషి ఆరోగ్యానికి భద్రత ఉంటుందని స్థానిక సిహెచ్‌సి దంత వైద్యాధికారి సుక్రత అన్నారు. గురువారం వరల్డ్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా నోటి దంతాలు పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ శరీరంలో అన్ని భాగాల కంటే నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఎందుకంటే దంతాలు, చిగుల్లులో పగుళ్ల వల్ల బ్యాక్టీరియా నోట్లో చేరి అనేక రకాలైన వ్యాధులు సంక్రమించే పరిస్థితి ఉందని అన్నారు. కావున ప్రతి ఒక్కరూ నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ శోభారాణి , వైద్యాధికారులు సునీల్, ఆశాకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.